సాక్షి
కామారెడ్డి
శనివారం । 31 । మే । 2025



పేరుకే పార్ట్‌టైం..
ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతతోపాటు సౌకర్యాలు కల్పించే పార్ట్‌టైం స్వీపర్ల పరిస్థితి దయనీయంగా మారింది.
- 10లో ▸



అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు
అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం అన్నారు.
- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.6 /23.3

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి



బాన్సువాడ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ సూచించారు. బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ల్యాబ్‌తోపాటు ఫార్మసీ గదిని, డెలివరీ రూములను పరిశీలించారు. ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలను నాటాలని సూచించారు. వైద్యులు విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఆస్పత్రి సిబ్బంది దయానంద్, శ్రీలేఖ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి జాయింట్ డైరెక్టర్ ఉషారాణి అన్నారు. మండలంలోని కల్వరాల్ జెడ్పీ పాఠశాలను జేడీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్య అందుతుందని, ప్రభుత్వ పాఠశాలలు బాగు పడాలంటే తల్లిదండ్రుల సహకారం అవసరమన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను ఏడు నుంచి 53కు పెంచిన హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డిని అభినందించారు. జేడీవెంట డీఈవో రాజు, వీడీసీ చైర్మన్ రాజురెడ్డి ఉన్నారు.

ప్రోటోకాల్ పేరుతో అడ్డంకులు



బీబీపేట: కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అభివృద్ధి చేయకపోగా, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రోటోకాల్ పేరుతో అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇంటి ఎదుట ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ శుక్రవారం బైఠాయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుతారి రమేశ్ మాట్లాడుతూ.. ఈ నెల 29వ తేదీన ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం ఉండగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి జిల్లా అధికారులకు ఫోన్ చేసి ప్రోటోకాల్ ప్రకారం తాను లేకుండా ఎలా ప్రారంభోత్సవం చేస్తారని బెదిరించారని మండిపడ్డారు. గెలిచిన నాటి నుంచి కేవీఆర్ గొప్పలు చెప్పుకోవడానికే పరిమితమయ్యారని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చెక్కులను ఇవ్వడానికే పరిమితమయ్యారని మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు విమర్శించారు. అభివృద్ధిపై వచ్చే నెల 5వ తేదీన బీబీపేట చౌరస్తాలో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని దమ్ముంటే రావాలని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. భూమాగౌడ్, ఇంద్రసేనారెడ్డి, ఆయా గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు

కామారెడ్డి టౌన్: పాఠశాలల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం, విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖకు శుక్రవారం ఆదేశాలు అందగా అధికారులు కసరత్తు ప్రారంభించనున్నారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిలో చాలా వ్యత్యాసం ఉంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు స్కూళ్లలో ఎక్కడికక్కడ సర్దుబాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి అధికారాలను కలెక్టర్‌కు అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే జీతభత్యాలు మాత్రం పోస్టింగ్ వచ్చిన స్కూల్ నుంచి ఇవ్వనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 10 మంది విద్యార్థులుంటే ఒక టీచర్, 11 నుంచి 60 మంది ఉంటే ఇద్దరు, 90 మంది ఉంటే ముగ్గురు, 120 మంది ఉంటే నలుగురు, 150 మంది ఉంటే ఐదుగురు, 200 మంది ఉంటే ఆరుగురు ఇలా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయనున్నారు. ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతోపాటు సబ్జెక్టుల వారిగా టీచర్లను సర్దుబాటు చేయాల్సి ఉంటుంది, ఒకే ప్రాంగణంలో ఉన్న రెండు మూడు పాఠశాలలను ఒక పాఠశాలగా పరిగణించనున్నారు. జూన్ 30వ తేదీలోగా ఈ సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశించింది.

అధికారులకు చేతినిండా పని!

ప్రభుత్వ అధికారులు తీరిక లేకుండా పనులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం వంటి పథకాలను గ్రౌండింగ్ చేయడానికి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతున్నారు. అలాగే భూభారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు ఊరూరా రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి వస్తోంది. బిజీ షెడ్యూల్ కారణంగా అలసిపోతున్నారు.



- ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పర్యవేక్షించడం
- రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక, శిక్షణ
- భూభారతి అమలుపై రెవెన్యూ సదస్సులు
- సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టాల్సిందే...
- విత్తనాలు, ఎరువుల సరఫరా, నకిలీ విత్తనాలపై ఫోకస్
- స్కూళ్లు, కాలేజీల్లో మౌలిక సదుపాయాల కల్పన
- జూన్ నెల మొత్తం బిజీ షెడ్యూల్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, భూభారతి అవగాహన సదస్సులు వీటికి తోడు ముందస్తు వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడం, విత్తనాలు, ఎరువుల కొరతను అధిగమించడం, నకిలీ విత్తనాలను అరికట్టడం, స్కూళ్లు, కాలేజీలు పునః ప్రారంభమవుతుండడంతో సౌకర్యాలపై దృష్టి పెట్టడం.. ఇలా ఆయా అంశాలపై అధికారులు నిరంతరం శ్రమించాల్సి ఉంటుంది. ఈ నెల 28, 29 తేదీలలో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి క్షేత్రస్థాయిలో పర్యటించి వానాకాలం సాగు ఏర్పాట్లు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతిపై సమీక్షలు నిర్వహించి జూన్ 1 నాటికి ప్రభుత్వానికి నివేదిక అందించాల్సి ఉంటుంది. 2న జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. తరువాతి రోజు నుంచి వరుస కార్యక్రమాలతో అధికారులు బిజీగా ఉండాల్సిందే. ఆయా కార్యక్రమాలు అమలుతీరుపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది.

రాజీవ్ యువ వికాసం గ్రౌండింగ్

రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి జూన్ 2 నుంచి 9వ తేదీ వరకు మంజూరు పత్రాలను అందించాల్సి ఉంటుంది. జూన్ 10 నుంచి 15వ తేదీ వరకు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో రాజీవ్ యువవికాసం లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 16 నుంచి స్వయం ఉపాధి యూనిట్లను ప్రారంభించాల్సి ఉంటుంది.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా..

ఈసారి రుతు పవనాలు ముందుగానే రావడంతో వర్షాకాలం పంటల సాగు మొదలుకానున్న నేపథ్యంలో అవసరమైన మేర విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలి. జిల్లాలో బోర్లు, బావులు, ప్రాజెక్టుల కింద వరి పంట సాగవుతుండగా, మెట్ట ప్రాంతాల్లో మొక్కజొన్న, పత్తి, సోయాతో పాటు పప్పు దినుసులు సాగు చేస్తారు. అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి. ఇదే సమయంలో నకిలీ విత్తనాలపై దృష్టి సారించాలి.

ఇందిరమ్మ ఇళ్లపై ఫోకస్

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పనులు ముందుకు కదలడం లేదు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అధికారులు ప్రోత్సహించాల్సి ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అధికారులకు దిశానిర్దేశం చేసింది. ఇదే సమయంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక దోపిడీ జరగకుండా కట్టడి చేయాలని ఆదేశించింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

వర్షాకాలం సీజన్‌లో డయేరియా, మలేరియా వంటి వ్యాధులు ప్రబలుతుంటాయి. ఈ నేపథ్యంలో పారిశుధ్య సమస్యను పరిష్కరించడం, తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవలసిన బాధ్యత యంత్రాంగంపై ఉంటుంది. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి సమస్యలు పరిష్కరించాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలన్నీ తీసుకోవాలి. ఒకవేళ వ్యాధులు ప్రబలితే వెంటనే వైద్య చికిత్స అందించాల్సి ఉంటుంది. అవసరమైన మందులు నిల్వ చేసి ఉంచాలి.

స్కూళ్లు, కాలేజీలు పునఃప్రారంభం

వేసవి సెలవులు ముగించుకుని స్కూళ్లు, కాలేజీలు పునఃప్రారంభం కానున్నాయి. స్కూళ్లు తెరిచే నాటికి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాంలు సిద్ధం చేయాలి. అలాగే స్కూళ్లు, కాలేజీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. చాలా స్కూళ్లలో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. స్కూళ్ల తెరవడానికి మరో పదిహేను రోజులు మాత్రమే ఉంది. ఈ లోపు అన్ని సమస్యలు పరిష్కరించాలి. అలాగే స్కూళ్లలో విద్యార్థులు చేరేలా బడిబాట నిర్వహించాలి. హాస్టళ్లు, గురుకులాలు, కస్తూర్బాలలో సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి.

జూన్ 3 నుంచి 20 వరకు భూభారతి సదస్సులు

ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూభారతి పోర్టల్‌పై జూన్ 3 నుంచి 20 వరకు మండలాల్లో భూ భారతి సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో రెవెన్యూ యంత్రాంగం సదస్సుల నిర్వహణపై దృష్టి సారించింది. భూభారతిపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన లింగంపేట మండలంలో రెవెన్యూ గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు జరిగాయి.

మిగతా 24 మండలాల్లో అవగాహన సదస్సులు చేపట్టాల్సి ఉంటుంది.

ఉత్తమ హాస్యనటుడు.. కామారెడ్డి కిశోరుడు

- వెన్నెల కిశోర్‌ను వరించిన గద్దర్ సినీ పురస్కారం
- ప్రతిభకు దక్కిన గుర్తింపు
- పెరిగింది, చదివింది ఇక్కడే..
- హర్షం వ్యక్తం చేస్తున్న స్నేహితులు, బంధువులు



వెన్నెల కిశోర్‌ను కలిసి అభినందించిన అక్కాబావ పున్న రాజేశ్వర్, అరుణ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : హాస్య నటుడిగా లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్న వెన్నెల కిశోర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న గద్దర్ సినీ పురస్కారం -2024కి ఉత్తమ హాస్య నటుడిగా ఎంపిక చేసింది. వచ్చే నెల 14న హైదరాబాద్‌లో నిర్వహించే వేడుకలో కిశోర్‌కు పురస్కారం అందజేయనున్నారు. కామారెడ్డి పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, యశోద దంపతులకు నలుగురు కూతుళ్లతో పాటు కుమారుడు కిశోర్. పట్టణంలోని జీవదాన్ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివిన కిశోర్ ఇంటర్మీడియెట్ మాతృశ్రీ కాలేజీలో అభ్యసించారు. తరువాత హైదరాబాద్‌లో ఉన్నత చదువులకు వెళ్లారు. డిగ్రీ పూర్తి చేసిన తరువాత విదేశాలకు వెళ్లేందుకు అవసరమైన వివిధ కోర్సులు అభ్యసించారు. ఇంగ్లిష్ పత్రికలు, ఇంగ్లిష్ నవలలు చదివే అలవాటున్న కిశోర్ ఆ భాషపై మంచి పట్టుసాధించారు. మాస్టర్స్ కోసం అమెరికా వెళ్లిన కిశోర్ చదువు పూర్తికాగానే అక్కడే ఉద్యోగంలో చేరారు. కామారెడ్డికి చెందిన స్నేహితులను కిశోర్ రెగ్యులర్‌గా కలుస్తుంటారు.

సినిమా పేరే ఇంటిపేరుగా..

అమెరికాలో ఉద్యోగం చేస్తున్న సమయంలో (2005) కిశోర్‌కు ఊహించకుండానే సినిమాలో నటించే అవకాశం వచ్చింది. 'వెన్నెల' సినిమాలో ఆయన నటించడంతో ఆ సినిమా పేరే ఆయన ఇంటి పేరుగా మారింది. ఆ తరువాత మూడునాలుగేళ్లపాటు సినీ అవకాశాలు లేకపోవడంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన తన భార్యతో కలిసి కిశోర్ ఇండియాకు వచ్చేశారు. 2009లో సినీ అవకాశాలు రావడం మొదలుకాగా, ఆ తరువాత కిశోర్ వెనక్కి తిరిగి చూసుకోలేదు. సుమారు 130కి పైగా సినిమాల్లో ఆయన నటించారు. పూర్తి స్థాయి నటుడిగా సినీ రంగంలో స్థిరపడ్డారు.

మరో అవార్డు..



రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాలు-2024ను గురువారం ప్రకటించింది. మత్తువదలరా-2 సినిమాలో నటించిన వెన్నెల కిశోర్, సత్యను సంయుక్తంగా ఉత్తమ హాస్యనటులుగా ఎంపిక చేసింది. గతంలో నంది, సైమా అవార్డులను కిశోర్ అందుకున్నారు. తాజాగా మరో పురస్కారం దక్కింది. కిశోర్‌కు అవార్డు దక్కడంతో ఆయన మేనల్లుడు, లిటిల్ స్కాలర్స్ స్కూల్‌కరస్పాండెంట్ పున్న రాజేశ్, అక్కా, బావ అరుణ, రాజేశ్వర్ ఆనందం వ్యక్తం చేశారు.

రెండు రోజుల్లో బ్రిడ్జి నిర్మాణ పనులు

రామారెడ్డి : రామారెడ్డి – కామారెడ్డి మధ్యలో గంగమ్మ వాగుపై నిలిచిన వంతెన నిర్మాణ పనులను రెండు రోజుల్లో ప్రారంభిస్తామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ అన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. 20 గ్రామాల ప్రజలను జిల్లా కేంద్రంతో కలిపే గంగమ్మ వాగు వంతెన నిర్మాణ పనులను వర్షాకాలంలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెండేళ్లుగా అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే చెప్పడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ సిబ్బందికి అవగాహన

కామారెడ్డి క్రైం: భూ భారతిని లింగంపేట మండలంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసిన నేపథ్యంలో ఇక్కడి అనుభవాలను మిగతా మండలాల రెవెన్యూ సిబ్బందికి వివరించేందుకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. రాష్ట్ర భూ పరిపాలన కమిషనర్ నవీన్ మిట్టల్ పైలెట్ ప్రాజెక్ట్ చేపట్టిన నాలుగు జిల్లాల కలెక్టర్‌లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. లింగంపేట్ మండలంలో అందిన భూ భారతి దరఖాస్తుల పరిశీలన, తీసుకుంటునన చర్యలపై కమిషనర్ సమీక్షించారు. లింగంపేట మండలంలో 4,225 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ సంగ్వాన్ తెలిపారు. వీసీలోలో అదనపు కలెక్టర్ వి విక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి) : ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. లింగంపేట మండల కేంద్రంలో ఫార్మీన్ బేగం ఇంటి నిర్మాణానికి కలెక్టర్ శుక్రవారం ముగ్గుపోసి మార్క్ అవుట్ ఇచ్చారు. కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని, అవసరమైన ఇసుక ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. రవాణా, లేబర్ ఖర్చులు లబ్ధిదారులు భరించాల్సి ఉంటుందన్నారు. దశల వారీగా నిర్మాణ పనులను బట్టి రూ.5 లక్షలు చెల్లిస్తామన్నారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. వర్షా కాలం ప్రారంభానికి ముందే మురికి కాల్వల్లో పూడికను తొలగించాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. వర్షం నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి మురళి, మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీవో పీడీ సురేందర్, ఎంపీడీవో నరేశ్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కేసు పెట్టారు.. వదిలేశారు!

- సీఎంఆర్ రికవరీలో అధికారుల తీరు
- ఒకరికి ధాన్యం ఇచ్చి.. మరొకరికి వేధింపులు
- నిజామాబాద్ జిల్లాలో రూ.250 కోట్లు, కామారెడ్డి జిల్లాలో రూ.45 కోట్ల విలువైన సీఎంఆర్ పెండింగ్
- చివరికి ఇన్‌చార్జి మంత్రి నిలదీయాల్సిన పరిస్థితి.. అయినా రికవరీపై అనుమానాలే..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సామాన్యుడు చిన్న తప్పిదం చేస్తే, అది నిరూపణ కాకముందే యుద్ధ ప్రాతిపదికన చర్యలకు ఉపక్రమించే అధికార యంత్రాంగం.. భారీ మాయాజాలం విషయంలో మాత్రం ప్రజాధనాన్ని రికవరీ చేయకుండా తమకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తోంది. దీనిపై సాక్షాత్తూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో అధికార యంత్రాంగాన్ని కడిగిపారేశారు. 2014-15 నుంచి 2022-23 సంవత్సరాలకు సంబంధించి నిజామాబాద్ జిల్లాలో 44 మిల్లుల నుంచి రూ.250 కోట్లు, కామారెడ్డి జిల్లాలో 49 మిల్లుల నుంచి రూ.45 కోట్ల విలువజేసే సీఎంఆర్ రికవరీ చేయాల్సి ఉంది. ఇందులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ నుంచి రావాల్సిందే రూ.60 కోట్ల మేర ఉండడం గమనార్హం. ఇందుకు సంబంధించి ఈ నెల 29న కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మంత్రి జూపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లవుతున్న ప్పటికీ రికవరీ చేయకుండా నోటీసులిచ్చి వదిలేయ డమేమిటంటూ అసహనం వ్యక్తం చేశారు. షెడ్యూ ల్, యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని కేసుల మీద కేసులు పెట్టి ఆరు నెలల్లో రికవరీ చేయాలని ఆదేశించారు.

- సీఎంఆర్ విషయంలో బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంత్రికి వివరించారు. దీంతో సంతృప్తి చెందని మంత్రి జూపల్లి రెండువారాల్లో పూర్తి వివరాలతో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని అడ్వొకేట్ జనరల్‌తో కలిసి హైదరాబాద్‌లో సమీక్షకు రావాలని ఆదేశించారు.
- హైకోర్టు ఆదేశాలతో కేసు అయితే నమోదు చేశారు కానీ.. తదుపరి విచారణ, చర్యల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం గమనార్హం. బాధితుడి సంతకం ఫోర్జరీ చేసినట్లు నిర్ధారణకు వచ్చిన హైకోర్టు తక్షణమే కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో చేసినప్పటికీ, ఇప్పటివరకు ఒక్కసారి కూడా సదరు అధికారులను పోలీసులు ప్రశ్నించకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. కాలయాపన చేస్తే చాలు అన్నట్లుగా యంత్రాంగం వ్యవహరిస్తోందని కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు గుర్రుగా ఉన్నారు. వందలకోట్ల ప్రజాధనం అక్రమార్కులు బొక్కేస్తే ఉన్నతాధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడంపై వాళ్లకు సైతం వాటాలు ముట్టినట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.



- 2021-22 యాసంగి, 2022-23 వానాకాలం సీజన్లకు గాను షకీల్‌కు చెందిన రహీల్, రాస్, అమీర్, దాన్విక్ అనే మిల్లుల పేరిట 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం ఇచ్చింది. అయితే ఈ మిల్లుల్లో ఒక్క గింజ ధాన్యం కూడా మిల్లింగ్ చేయలేదు. నేరుగా ధాన్యాన్ని అక్రమ మార్గంలో ముంబై, కాకినాడ పోర్టుల ద్వారా ఎగుమతి చేసి సొమ్ము చేసుకున్నాడు. కేవలం 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ఇచ్చేంత పరిమాణంలో రీసైకిల్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు ఇచ్చాడు. ఓ 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రం ఏఆర్ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఆర్‌కాం ఇండస్ట్రీస్ (వర్ని), అబ్దుల్ ఐ ఇండస్ట్రీస్ (ఎడపల్లి), ఎఫ్‌టీఎఫ్ ఇండస్ట్రీస్ (బోధన్) వాళ్లకు ఇచ్చినట్లు చూపించాడు. ఈ నాలుగు మిల్లుల యజమానులతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని బలవంతంగా ధాన్యం తీసుకున్నట్లు లేఖలు ఇప్పించాడు. షకీల్ ఒత్తిడితోనే లేఖలు ఇచ్చినట్లు సదరు మిల్లర్లు తెలిపారు. రూ.60 కోట్ల విలువ చేసే ధాన్యానికి బియ్యం ఇవ్వకపోవడంతో ప్రభుత్వం షకీల్‌కు చెందిన మిల్లులకు రూ.10 కోట్ల జరిమానా వేసింది. ఇప్పటివరకు షకీల్ కస్టమ్ మిల్లింగ్ రైస్ ఇవ్వకపోవడంతో పాటు, జరిమానా సైతం కట్టలేదు. అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చామని చెబుతూ కాలం గడిపారు. మరోవైపు బాధితుడు కిశోర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కథ నడిపిన అధికారులే, సీఎంఆర్ సైతం కిశోరే ఇవ్వాలంటూ ఒత్తిడి చేయడం గమనార్హం. న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రస్తుతం సంగారెడ్డి అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న, గతంలో నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చంద్రశేఖర్, మాజీ డీఎస్‌వో చంద్రప్రకాశ్, డిప్యూటీ తహసీల్దార్ నిఖిల్‌రాజ్‌లపై వర్ని పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

అధికారంలో ఉన్న సమయంలో..

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కోట్లాది రూపాయల విలువజేసే ధాన్యాన్ని ప్రభుత్వం నుంచి తీసుకుని ఒక్క గింజ కూడా మిల్లింగ్ చేయకుండా అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టం వచ్చినట్లు దందా చేశాడు. మళ్లీ అధికారంలోకి వస్తామనే నమ్మకంతో ధాన్యం ఇవ్వకుండానే కిషోర్ మిల్లు నుంచి సీఎంఆర్ ఇవ్వాల్సిందేనని ఒత్తిడి చేయించాడు.

క్లుప్తంగా

అవతరణ వేడుకల అతిథి రమేశ్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల అతిథిగా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 2వ తేదీన జిల్లా కేంద్రంలో అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు ప్రారంభించారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద గ్రామ పంచాయతీ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిన విషయం తెలిసిందే. మున్సిపల్ కమిషనర్‌గా మహ్మద్ ఖయ్యూం శుక్రవారం ప్రత్యేకాధికారి దిలీప్‌కుమార్ చేతులు మీదుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ..కందర్‌పల్లి, గోపన్‌పల్లి, దౌల్తాపూర్ కార్యదర్శులు జీపీ రికార్డులు, పన్ను వసూలు చేసిన రిసిప్ట్ బుక్కులు, గ్రామంలో చేసిన పనులకు చెల్లించాల్సిన బిల్లుల రికార్డులతోపాటు మొత్తం కార్యాలయ రికార్డులు అప్పగించాలని సూచించారు. జీపీ రికార్డులు పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. ఇక నుంచి ఇళ్ల నిర్మాణాల అనుమతులు, లావాదేవీలు జరపొద్దని,ఇకనుంచి మున్సిపాలిటీ పరిధిలోనే చెల్లింపులు, అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మూత్రశాలకు తాళం



బీబీపేట: మండలకేంద్రంలోని రైతువేదిక వద్ద మూత్రశాలకు తాళం వేయడంతో శుక్రవారం జీలుగ విత్తనాల కోసం వచ్చిన రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతు వేదిక చుట్టూ ఇళ్లు ఉండడంతో మహిళా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక్కడే మండల వ్యవసాయాధికారి నరేందర్ విధులు నిర్వహిస్తుంటాడు. ఆయన కూడా చూసి చూడనట్లుగా వదిలేయడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు ప్రతిరోజు మరుగుదొడ్లు తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి 132 సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఏర్పడుతుందని ఎస్ఈ శ్రావణ్‌కుమా ర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి పట్టణంతోపాటు గ్రామాల్లోనూ వి ద్యుత్ సరఫరా నిలిచిపోనుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పేరుకే పార్ట్‌టైం.. పనులు ఫుల్‌టైం

- దయనీయంగా మారిన స్కూల్ స్వీపర్ల పరిస్థితి
- అరకొర వేతనాలతో తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కలెక్టర్‌కు వినతి పత్రం అందించేందుకు వచ్చిన ఉమ్మడి జిల్లా పార్ట్‌టైమ్ స్వీపర్లు (ఫైల్)

కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతతోపాటు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించే పార్ట్‌టైం స్వీపర్ల పరిస్థితి దయనీయంగా మారింది. పేరుకే పార్ట్ టైం అయినప్పటికీ పనులు మాత్రం ఫుల్‌టైమ్ చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఉదయం నుంచి పాఠశాల ముగిసే వరకు డ్యూటీ చేయాల్సి వస్తుందని, అయినా అరకొర వేతనాలనే అందిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 110 మంది స్వీపర్లు..

ఉమ్మడి జిల్లాలో సుమారు 200 మంది వరకు పార్ట్ టైం స్వీపర్లుగా 1986లో విధుల్లో చేరారు. అప్పుటి ప్రభుత్వం కేవలం రూ.150 వేతనం మాత్రమే అందించేది. విధులు నిర్వహిస్తున్న పార్ట్ టైమ్ స్వీపర్లలో 40 మంది వరకు చనిపోయారు. మరో 30 మంది పదవీవిరమణ పొందారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో 80 మంది వరకు, నిజామాబాద్ జిల్లాలో 30 మంది వరకు ఆయ పాఠశాలల్లో స్వీపర్లుగా కొనసాగుతున్నారు. పార్ట్‌టైమ్ స్వీపర్లు అన్న మాటే కానీ ప్రతిరోజు పాఠశాలలో ఫుల్‌టైమ్ విధులు నిర్వహించాల్సిన వస్తోందని, ఈ ఉద్యోగం వదులుకోలేక ఇతర పనులు చేసుకోలేకపోతున్నామని వాపోతు న్నారు. నెల జీతం రూ.5,200 వస్తుండటంతో 25 రోజులు పనులు చేస్తే రోజు వేతనం రూ. 208 మాత్రమే వర్తిస్తుందన్నారు. దీంతో కనీసం ఉపాధి హామీ కూలీ వేతనం కూడా గిట్టుబాటు కానీ పరిస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్‌లో వేతనాలు..

పార్ట్‌టైమ్ స్వీపర్లుగా ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనం మాత్రం పెరగడం లేదని, దీంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలో తెలియడం లేదని వారు వాపోతున్నారు. అరకొర వేతనాలు ఇస్తుండటంతోపాటు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ వేతనాలు కూడా నెలల తరబడి బయాయి పెట్టడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్వీపర్ల దీన పరిస్థితిని గమనించి వారిని ఫుల్‌టైమ్ స్వీపర్లుగా గుర్తించి పూర్తిస్థాయి వేతనాలు అందించాలని కోరుతున్నారు.

కుటుంబాన్ని పోషించలేని దుస్థితి..



నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం వాడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గత 40 ఏళ్లుగా పార్ట్‌టైం స్వీపర్‌గా పని చేస్తున్నా. 1986లో జీతం రూ. 150 కాగా ఇప్పుడు రూ.5,200 వస్తుంది. వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషించలేని పరిస్థితి ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో అన్ని పనులు చేస్తాం. ప్రభుత్వం మా ఉద్యోగులను పర్మినేంట్ చేయాలి. –బాలయ్య, స్వీపర్స్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం ఆదుకోవాలి



1992 నుంచి స్వీపర్‌గా పని చేస్తున్నా. ఉదయం గంట కొట్టుడు నుంచి సాయంత్రం బడికి తాళం వేసే వరకు ఉంటాం. మమ్మల్నీ మాత్రం పట్టించుకునే వారు లేరు. ఏళ్లుగా వేతనం పెరగడం లేదు. ప్రభుత్వం మా పరిస్థితిని పరిశీలించి ఫుల్ టైమ్ స్వీపర్ గా గుర్తించి పూర్తిస్థాయి వేతనం అందించాలని వేడుకుంటున్నా. ఇప్పటికైనా ప్రభుత్వం స్వీపర్లను ఆదుకోవాలని కోరుతున్నాం.

–గడీల సరోజ, గర్ల్స్ హైస్కూల్, కామారెడ్డి

రైతులకు అండగా బీజేపీ ప్రభుత్వం





జిల్లా కేంద్రంలో పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు, బాన్సువాడలో..

కామారెడ్డి టౌన్/లింగంపేట : రైతులు పండించే 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)ను పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ భారతీయ జనతా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే లింగంపేటలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్ర పటానికి బీజేపీ నాయకులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ రైతులకు అండగా బీజేపీ ప్రభుత్వం ఉంటుందన్నారు. ఎంఎస్‌పీకి రూ. 2.70 లక్షల కోట్లు, రైతులకు వడ్డీ రాయితీకి రూ. 15,642 కోట్ల నిధులు, పెట్టుబడిపై రైతులకు 50% లాభం ఉండేలా నిర్ణయం తీసుకోవడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిలా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, కిసాన్ మోర్చా నాయకులు గంగారెడ్డి, కడెం శ్రీకాంత్, ఆనందరావు, లింగారావు, రాజు, జైపాల్ రెడ్డి, నరసింహ రెడ్డి, వీరేశం, రైతులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, ఓబీజీ జిల్లా మాజీ అధ్యక్షుడు మురళి, బిఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్ది శివ్వయ్య,

బాన్సువాడ : రైతుల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కోనాల గంగారెడ్డి, నాయకులు శంకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చిదరి సాయిలు, శ్రీనివాస్, చిరంజీవి, ఉమేష్, యోగి, చీకట్ల రాజు, కొండని గంగారం, రామకృష్ణ, కిషన్ తదితరులున్నారు.

టేక్రియాల్‌లో కుక్కల బెడద



కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో కుక్కల బెడద ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రోడ్డు వెంబడి వెళ్లాలంటే కుక్కలు వెంట పడుతున్నాయని ఈ విషయమై పలు మార్లు మున్సిపల్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడదను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా నీటితొట్టి



మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని కుర్లాలోని బస్టాండ్ ప్రధాన రహదారి పక్కన గల పశువుల నీటి తొట్టి అపరిశుభ్రంగా మారింది. నీటితొట్టె పాకురు, నాచు, కలుషితమైన నీటితో నిండిపోయింది వానాకాలం ప్రారంభం అవుతున్న దృష్ట్యా దోమలు, ఈగలు వ్యాప్తి చెందిన రోగాలు ప్రబలే అవకాశాలున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

దోమకొండలో కరాటే పోటీలు



దోమకొండ: మండల కేంద్రంలో శుక్రవారం ఒకినోవా గోజరో నీడుకాయ్ జాతీయ స్థాయి కరాటే పోటీలను నిర్వహించారు. సంస్థ తెలంగాణ అర్గనైజర్ కరాటే గ్రాండ్ మాస్టర్ కామిండ్ల రాజయ్య ఆధ్వర్యంలో 155 మంది క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. పోటీలకు జర్మనీ దేశానికి చెందిన కరాటే గ్రాండ్ మాస్టర్ హన్సీ ఫీటర్, షిహన్‌సోల్, బెల్జియం దేశానికి చెందిన షిహన్ రెయిన్ హోమ్స్ హాజరైనట్లు రాజయ్య వివరించారు. కరాటే సీనియర్ బ్లాక్ బెల్ట్ మాస్టర్‌లు కామిండ్ల నవీన్‌కుమార్, స్వామి, సాయినాథ్‌గౌడ్, సంతోష్, లక్ష్మి నర్సు, సిద్ధరాములు, కుమార్, సాత్విక్, రోహిత్, హరిప్రసాద్, సిద్ధరాములు, సుభాష్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు



బోర్లం క్యాంపులో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- గృహలక్ష్మి లబ్ధిదారులూ అర్హులే..
- లబ్ధిదారులకు తక్కువ ధరకే ఇసుక
- వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: అర్హులైన పేదలకు కుల, మతాలు, పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఇస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన బాన్సువాడ మండలం బోర్లంక్యాంపు తండాలో ఇరువురు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గతంలో గృహలక్ష్మిలో భాగంగా జిల్లాకలెక్టర్ ద్వారా మంజూరు వచ్చిన వారు కూడా ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవడానికి అర్హులేనన్నారు. గతంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణంలో బాన్సువాడ నియోజకవర్గం ఆదర్శంగ నిలిచినట్లు ఇందిరమ్మ ఇంటినిర్మాణాల్లోనూ ఆదర్శంగా నిలపడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఇసుక అతి తక్కువ ధరకు లబ్ధిదారులకు సరఫరా చేసేలా ట్రాక్టర్ ఓనర్లను ఒప్పించామన్నారు. ఆయన వెంట స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, హౌసింగ్ డీఈ గోపాల్, డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో ముజాహిద్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, రాజేశ్వర్‌గౌడ్, మమ్మాయి కాశీరాం, పీర్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, కొండా శ్రీశైలం, సుభాష్, సంజీవ్‌రెడ్డి , కాపర్తి భరత్ తదితరులు పాల్గొన్నారు.



బస్వాపూర్‌లో లబ్ధిదారుకు ఇంటి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి

భిక్కనూరు/నాగిరెడ్డిపేట/బాన్సువాడ /నస్రుల్లాబాద్/ నిజాంసాగర్/కామారెడ్డి రూరల్ : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణపనులను వేగవంతంగా పూర్తి చేయాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజలో పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలను అందజేసి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నాగిరెడ్డిపేట మండలం మెల్లకుంట తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎల్లారెడ్డి డీఎల్‌పీవో మార్కింగ్ ఇచ్చి లబ్ధిదారులకు మంజూరుపత్రాలను అందజేశారు. బీర్కూర్ మండలం దామరంచ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. నస్రుల్లాబాద్ మండలం సంగం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్ భూమి పూజ చేశారు.నిజాంసాగర్ మండలం ఒడ్డేపల్లి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రజా పండరి అందజేశారు.కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఆకుల రూప రవికుమార్ మాట్లాడుతూ...ఇళ్ల నిర్మాణం చేపట్టినవారికి దశలవారిగా బిల్లులు మంజూరవుతాయన్నారు.



మెల్లకుంటతండాలో ఇంటి నిర్మాణానికి మార్కింగ్ ఇస్తున్న డీఎల్‌పీవో సురేందర్



ఒడ్డేపల్లిలో ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ప్రజా పండరి

వెన్నునొప్పితో వెళ్తే ప్రాణాలే పోయాయి





ఆస్పత్రిలో గుమిగూడిన మృతురాలి బంధువులు, ఇన్‌సెట్‌లో.. రాధిక (ఫైల్)

- ఆపరేషన్ తర్వాత మహిళ మృతి
- ప్రైవేటు ఆస్పత్రిలో రోజంతా హైడ్రామా
- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకుల ఆందోళన
- ప్రాణానికి వెలకట్టిన ఆస్పత్రి యాజమాన్యం

నిజామాబాద్‌నాగారం: వెన్నునొప్పి చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళ ఆపరేషన్ అనంతరం కన్నుమూసింది. నగరంలోని ప్రతిభ ఆస్పత్రిలో శుక్రవారం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన రాధిక(35) వెన్నునొప్పితో బాధపడడంతో భర్త సురేశ్ ప్రతిభ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. పరీక్షించిన వైద్యులు వెన్నుపూసకు ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని తెలపడంతో సురేశ్ ఒప్పుకున్నాడు. గురువారం ఉదయం ఆపరేషన్ పూర్తి చేసి రాధికను వెంటిలేటర్‌పై ఉంచగా శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో మరణించింది. కాగా, సీనియర్ వైద్యులు చేయాల్సిన ఆపరేషన్‌ను జూనియర్ వైద్యులు చేయడంతోనే రాధిక మృతి చెందినట్లు భర్త, కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. ఆపరేషన్ చేస్తామని చెప్పి ప్రాణాలు తీశారంటూ బోరున విలపించారు. ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులు వచ్చి మృతదేహాన్ని తీసుకొని బయటికి వెళ్లాలని చెప్పడంతో కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అదే సమయంలో మృతురాలి కుటుంబీకులు, బంధువులు, కుల సంఘాల ప్రతినిధులు, మీడియా, పోలీసులు ఆస్పత్రికి చేరుకోవడంతో శవాన్ని ఆస్పత్రి లోపలికి తీసుకెళ్లారు. అనంతరం రూ. లక్ష ఇస్తామని, మృతదేహాన్ని తీసుకెళ్లాలని బేరసారాలకు దిగడంతో కుటుంబసభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆపరేషన్ ఎలా చేశారో, కే షీట్, ఎంఆర్ఐ తదితర వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కుటుంబసభ్యుల ఆందోళన, యాదవ సంఘం మహిళా అధ్యక్షురాలు మంజుల యాదవ్ ఒత్తిడితో చివరకు రూ. 3లక్షల 20వేలకు రాజీకుదిరింది. మహిళ మృతి, కుటుంబసభ్యుల ఆందోళన విషయం తెలుసుకొని సిబ్బందితో కలిసి ప్రతిభ ఆస్పత్రికి చేరుకున్న నగర సీఐ శ్రీనివాస్‌రాజ్..బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. కాగా, రాధిక మృతదేహానికి పోస్టుమార్టం చేయిస్తే అసలు నిజాలు బయటికి వచ్చేవని స్థానికంగా పలువురు చర్చించుకున్నారు.

దాడి ఘటనలో పలువురిపై కేసు నమోదు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఓ వ్యక్తిపై దాడిచేసిన ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. వివరాలు ఇలా.. క్రాంతికుమార్ అనే వ్యక్తి మండల కేంద్రంలో గత కొంత కాలంగా మీ–సేవా కేంద్రాన్ని నడిపిస్తున్నాడు. అట్టి మీ సేవా కేంద్రాన్ని మండల కేంద్రానికి చెందిన కటికె శ్రీనివాస్‌కు ఇటీవల రూ.5లక్షలకు విక్రయించాడు. శ్రీనివాస్ నాలుగు నెలల తర్వాత మీ–సేవా వద్దు నా డబ్బులు నాకు ఇవ్వాలని క్రాంతికుమార్‌ను అడిగాడు. దీంతో అతడు రూ.3లక్షల 95వేలు ఇచ్చేసి, ఫర్నీచర్ పనికిరాకుండా పోవడంతో రూ.25వేలు పట్టుకున్నట్లు క్రాంతి తెలిపాడు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈనెల 23న సాయంత్రం స్కూటీపై వెళ్తున్న క్రాంతిని, శ్రావణ్‌కుమార్ అనే వ్యక్తి గొడవపడ్డాడు. అలాగే పల్వాంచ నితిన్‌కుమార్, తోకల గిరీశ్,గంగుల రమేశ్, దేవునిపల్లికి చెందిన జాకీర్. కందుకూరి మధు, శ్రీనివాస్‌లు అతడిపై దాడి చేసి స్కూటీని తీసుకున్నారు. ఘటనపై క్రాంతి కుమార్ సోదరి పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితులను పట్టుకున్నారు. వారు నేరాన్ని ఒప్పుకోవడంతో వారి వద్ద నుంచి క్రాంతి స్కూటీతో పాటు మరో బైక్, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చదివించాలి



లక్ష్మాపూర్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి/తాడ్వాయి : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అలాగే తాడ్వాయితో పాటు కృష్ణాజీవాడి, బ్రహ్మజీవాడి, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాలలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాడ్వాయి ఎంఈవో రామస్వామి మాట్లాడారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి

బాన్సువాడ రూరల్: జూన్ 6 నుంచి ప్రారంభం కానున్న బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాన్సువాడ ఎంపీడీవో ముజాహిద్ కోరారు. శుక్రవారం ఆయన బోర్లం క్యాంపులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బడిబాట సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, నాయకులు పీర్యానాయక్, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు , వంశీ, హరికృష్ణ, సంత్యాలి,సావిత్రి, ఉపాధ్యాయులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

డ్రెయినేజీలో పడి ఒకరి మృతి

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రం సమీపంలోని మురికి కాలువలోవో వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని శక్కర్గ గ్రామానికి చెందిన శంకర్(37) బిచ్కుంద మార్కెట్‌లో కూలీ పనులు చేసి, తిరిగి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి మురికి కాలువలో పడి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

బాన్సువాడ రూరల్: బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసే తలారీ శ్రీనివాస్ (53) శుక్రవారం స్థానిక ఎల్లయ్య చెరువులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎల్లారెడ్డిలో నివాసం ఉండే శ్రీనివాస్ విధులకు వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. కానీ చెరువులో శవమై ఉండటంపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించినట్లు వివరించారు.

కృష్ణాజివాడిలో ఒకరి ఆత్మహత్య

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మురళి తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన సాకలిసాయిలు(54) గత మూడేళ్లుగా అల్సర్, కడుపు నొప్పితో బాధపడుతుండే వాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సాయిలు శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి, గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య మణెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కంబోడియాలోనే కిరణ్‌కుమార్ అంత్యక్రియలు



కిరణ్‌కుమార్ (ఫైల్)

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లికి చెందిన భూంరావుగారి కిరణ్‌కుమార్ ఉపాధి కోసం కంబోడియా రాజధాని నాంఫెన్‌కి వెళ్లగా, ఈనెల 14న గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహాన్ని సొంతూరికి తీసుకురావడానికి వీసాకు సంబంధించి పలు చిక్కులతో పాటు ఆర్థిక భారం కావడంతో చివరిచూపు కోసం కుటుంబ సభ్యులు పాస్‌పోర్టులకు దరఖాస్తు చేసుకున్నారు. పాస్‌పోర్టులు చేతికి అందడంతో బుధవారం వారు నాంఫెన్ వెళ్లారు. శుక్రవారం ఉదయం అక్కడే కిరణ్‌కుమార్ అంత్యక్రియలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భార్య మందాకిని, కొడుకు కార్తికేయ, తల్లి సుగుణబాయి, అన్న ప్రవీణ్‌కుమార్ అంత్యక్రియల్లో పాల్గొనగా, గుగుల్ మీట్ ద్వారా ఇక్కడి బంధువులు అంత్యక్రియలను తిలకించి కన్నీరు పెట్టుకున్నారు. నాంఫెన్ వెళ్లిన కుటుంబసభ్యులను భారత రాయబార కార్యాలయం అధికారులు మంచి సహకారం అందించారని కిరణ్‌కుమార్ బంధువు శ్రీకాంత్‌రావు తెలిపారు.

ఠాణా నుంచి గంజాయి మాయం

- 2018లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ప్రస్తుతం కనిపించకపోవడంతో విచారణ చేపట్టిన అధికారులు

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో గంజాయి మాయం అయింది. 2018లో గంజాయిని తరలిస్తున్న వారి నుంచి అప్పటి ఎస్‌హెచ్‌వో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను, గంజాయిని పోలీసులు కోర్టులో చూపించారు. ఎవిడెన్స్ కేసు అయిపోయే వరకు పీఎస్‌లో భద్రపర్చాల్సి ఉంటుంది. కానీ భద్రపర్చిన గంజాయి ఇప్పుడు కనిపించకుండా పోవడంతో స్పెషల్ బ్రాంచ్ అధికారులు విచారణ చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌లోని ఓ గదిలోనే కోర్టు కానిస్టేబుల్ గంజాయిని భద్రపర్చగా.. అందులో కొంత పోలీసులు అమ్ముకున్నారనే కోణంలో ఎస్బీ పోలీసులు విచారణ చేస్తున్నారు. వారు ఇప్పటికే పీఎస్‌లో సిబ్బందితోపాటు కోర్టు కానిస్టేబుల్, 2018 నుంచి పని చేసిన ఎస్‌హెచ్‌వోలను విచారించినట్లు తెలిసింది. ఈ పీఎస్ పాతబడిన భవనం కావడంతో గతంలో కూలిపోయింది. అప్పుడు పట్టుకున్న గుట్కా, జర్దా సంచులతోపాటు గంజాయి సంచులు ఏమైనా మార్పులు జరిగాయా లేక గంజాయిని అమ్మివేశారా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. గంజాయి మాయంపై పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

వక్ఫ్‌చట్టానికి వ్యతిరేకంగా ర్యాలీ

బాన్సువాడ : కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్‌చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం బాన్సువాడలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. బాన్సువాడ తంజిముల్ మస్జీద్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ఇంతియాజ్, అజీంలు మాట్లాడుతూ వెంటనే వక్ఫ్‌చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తాడ్కోల్ చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ఎజాస్, వహాబ్, అలిమోద్దీన్‌బాబా, దావూద్, అసద్, ఖయ్యూం, అప్రోజ్ తదితరులున్నారు.

తాళం వేసిన ఇళ్లల్లో చోరీ

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో గురువారం రాత్రి తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పిట్లంలోని యూనియన్ బ్యాంక్ వెనకగల చాకలి బాలరాజ్, ఎండీ మెహబూబ్, చాకలి రమేశ్, థియేటర్ వెనకగల చాకలి లక్ష్మిల ఇళ్లకు తాళాలు ఉన్నాయి. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆఇంటి తాళాలను పగలగొట్టి, సుమారు రూ.లక్షన్నర విలువ గల బంగారు, వెండి ఆభరణాలు, కొంత నగదు చోరీ చేశారు. మరుసటి రోజు ఉదయం చోరీని గుర్తించిన బాధిత కుటుంబాలు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై శివకుమార్ తెలిపారు.